


సోమవారం 14 సెప్టెంబర్ 2026 పేజీలు : 8

## అసెంబ్లీ -2028 ఎన్నికల్లో తెలంగాణలో బీఎస్పీ సత్తా చాటాలి



బూత్ స్థాయి వరకు పార్టీని పటిష్టం చేయాలి: మాజీ రాజ్యసభ సభ్యులు రాజారామ్

రాష్ట్రస్థాయి ఈసీ సమావేశంలో పాల్గొన్న మంచిర్యాల జిల్లా నాయకులు

# వినాయక చవితి సందడితో కిక్కిరిసిన మార్కెట్లు

విగ్రహాలు.. పూలు.. పండ్లు.. పత్రులతో పండుగ శోభ ధరలు చూసి అవాక్కైన భక్తులు

మట్టి గణపతుల పంపిణీతో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం





## 5,261 కేసులకు పరిష్కారం



రూ. 33.65 లక్షలు సైబర్ బాధితులకు తిరిగి అందజేత

రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

## పవిత్ర రామాలయ ప్రాంగణంలో రూ.30 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం



మంచిర్యాల, సెప్టెంబర్ 13 (ప్రజాజ్యోతి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ (పాత మంచిర్యాల)లో గల అతి పురాతనమైన, ఎంతో విశిష్టమైన పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీ రామాలయం--శివాలయం--భక్త ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో భక్తి శ్రద్ధల మధ్య కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు మంచిర్యాల శాసనసభ్యులు శ్రీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు శంకుస్థాపన చేశారు.

# నస్పూర్‌లో విత్తన మట్టి గణపతుల పంపిణీ

**పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులే మేలు శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్**



మంచిర్యాల, 13,సెప్టెంబర్ (ప్రజా జ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ కోరారు. వినాయక చవితిని పురస్కరించుకొని సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని నస్పూర్ సీఈఆర్ క్లబ్ ప్రాంగణంలో విత్తన మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.శ్రీరాంపూర్ సేవా అధ్యక్షురాలు ఉమారాణితో కలిసి జీఎం మునిగంటి శ్రీనివాస్ సేవా సభ్యులు, మహిళలు, చిన్నారులు, స్థానికులకు పెద్ద సంఖ్యలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణహిత వినాయక చవితి నిర్వహణలో భాగంగా సింగరేణి సంస్థ ప్రతి సంవత్సరం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తోందన్నారు.ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల నిమజ్జనం కారణంగా చెరువులు, నదులు కలుషితమై నీటిలోని చేపలు, ఇతర జలచరాలు మృత్యువాత పడుతున్నాయని తెలిపారు. నీటి కాలుష్యాన్ని నివారించడంతో పాటు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో సింగరేణి సంస్థ ఖర్చుకు వెనుకాడకుండా మట్టి గణపతులను పంపిణీ చేస్తోందన్నారు.విత్తన మట్టి గణపతి విగ్రహాల ప్రత్యేకతను వివరిస్తూ ప్రతి విగ్రహంలో ఒక విత్తనం ఉంటుందని తెలిపారు. వినాయక చవితి అనంతరం విగ్రహాన్ని ఇంటి ప్రాంగణంలో నీటితో తడిపితే అందులోని విత్తనం మొలకెత్తి మొక్కగా ఎదుగుతుందని చెప్పారు. ప్రతి గణపతి విగ్రహం భవిష్యత్తులో ఒక చెట్టుగా ఎదిగి వాయు కాలుష్య నివారణకు దోహదపడాలని ఆకాంక్షించారు.సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో అన్ని ఏరియాల్లో పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా వేలాది రూపాయలు వెచ్చించి వేలాది మట్టి విత్తన గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని జీఎం మునిగంటి శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా సేవా అధ్యక్షురాలు ఉమారాణి, సీఎంఓఏ ప్రతినిధి పద్మ, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ మురళి, సంక్షేమ అధికారి ఓంకార్ బాబు, సేవా సెక్రెటరీ కొట్టే జ్యోతి, ఇతర అధికారులు, సేవా సభ్యులు, మహిళలు, చిన్నారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల సమస్యలపై పోరాడాలి

**ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడికి ఘన సన్మానం**



**ఆసిఫాబాద్, సెప్టెంబరు 13 ప్రజా జ్యోతి** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నూతన ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా నియమితులైన ఎండీ ఆసిఫ్ అలీని కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం ఆసిఫాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్, మాజీ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీపీ బొమ్మన బాలేష్‌గౌడ్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. ఎన్ఎస్‌యూఐ కాంగ్రెస్ పార్టీకి కీలకమైన విద్యార్థి విభాగమన్నారు. జిల్లాలోని కళాశాలల్లో ఎన్ఎస్‌యూఐని బలోపేతం చేసి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాడాలని సూచించారు. రాహుల్‌గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి ఆసిఫ్ అలీ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ఎన్ఎస్‌యూఐ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి శివప్రసాద్, ఆర్టీఏ సభ్యుడు లవడే రమేష్, కౌన్సిలర్ రాపర్తి కార్తీక్, నాయకులు కొండా సాయి, జమీర్ అహ్మద్, అయాన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# రాదక్క సేవలు చిరస్మరణీయం

**ఆదివాసీల హక్కుల కోసం ఆమె కృషి మరువలేనిది**

**ఆత్రం సుగుణక్క**



**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 13 ప్రజా జ్యోతి** తెలంగాణ తొలి మావోయిస్టు ఆదివాసీ మహిళగా పేరొందిన మాజీ మావోయిస్టు కుర్సెంగ మోతీబాయి అలియాస్ రాదక్క సంస్మరణ సభ రామగుండంలోని అన్నపూర్ణ కాలనీలో ఆమె స్వగృహంలో నిర్వహించారు. కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క దంపతులు హాజరై రాదక్క చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ.. గత పార్లమెంట్ ఎన్నికల్లో తాను కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు రాదక్క ఆదివాసీ గూడాల్లో విస్తృతంగా ప్రచారం చేసి తన విజయానికి కృషి చేశారని గుర్తుచేశారు. ఉద్యమ జీవితాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చిన అనంతరం కాంగ్రెస్‌లో చేరి క్రియాశీలకంగా పనిచేశారని తెలిపారు. ఆదివాసీల హక్కులు, అభివృద్ధి కోసం రాదక్క చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆమె మృతి కాంగ్రెస్ పార్టీతోపాటు ఆదివాసీ సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు.

## మల్టీపర్పస్ వర్కర్‌పై సర్పంచ్, కుమారుడి దాడి!

**గాయాలతో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిక..**

**మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా**



**ఆసిఫాబాద్, సెప్టెంబరు 13, ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం సలుగుపల్లి గ్రామపంచాయతీకి చెందిన మల్టీపర్పస్ వర్కర్ చొప్పదండి సత్తయ్యపై సర్పంచ్ శ్రీహరి, ఆయన కుమారుడు దాడి చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనలో సత్తయ్యకు తీవ్ర గాయాలు కావడంతో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న సంబంధిత నాయకులు ఆసుపత్రికి వెళ్లి సత్తయ్యను పరామర్శించి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.కార్మికుడిపై దాడిని తీవ్రంగా ఖండించిన వారు.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## జన్నారం అటవీ డివిజన్‌లో శిక్షణ ఎఫ్ ఆర్ వో ల క్షేత్ర పర్యటన



**జన్నారం,సెప్టెంబర్13(ప్రజాజ్యోతి)** జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ (టి జి ఎఫ్ ఏ), దూలపల్లి శిక్షణ ఎఫ్ ఆర్ వో లు క్షేత్ర పర్యటన నిర్వహించారు.హైదరాబాద్ లోని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 60 మంది రేంజ్ అధికారులు, డిప్యూటీ డైరెక్టర్ మంజుల ఆధ్వర్యంలో జన్నారం అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. వీరు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వారు.ఈ సందర్భంగా ట్రైనీ ఎఫ్ ఆర్ వో లు జన్నారం డివిజన్ లోని గొండుగూడ గేట్ నెం.1 నుండి బైసన్ కుంట వరకు కాలినడకన అటవీ ప్రాంతంలో పర్యటించారు. కవాల్ టైగర్ రిజర్వ్ లోని అటవీ పర్యావరణం, వన్యప్రాణుల ఆవాసాలు, జీవవైవిధ్యం, అటవీ సంరక్షణ చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. వివిధ వృక్ష, జంతు జాతులు, బైసన్ కుంట వద్ద పక్షుల గురించి తెలుసుకున్నారు.అనంతరం ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ రామ్ మోహన్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బాబా ఖాదర్ వలి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మమత లు శిక్షణార్థులకు క్షేత్రస్థాయి అటవీ నిర్వహణ, రక్షణ చర్యలు, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా జన్నారం డాగ్ స్క్వాడ్ ను సందర్శించారు. అటవీ నేరాల నియంత్రణ, అక్రమ రవాణా, వన్యప్రాణుల నేరాల గుర్తింపులో స్నిఫర్ డాగ్స్ పాత్ర, వాటికి ఇస్తున్న శిక్షణ, విధుల నిర్వహణ తీరును తెలుసుకున్నారు.

# ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును కలిసిన మత్స్య శాఖ సొసైటీ నూతన పాలకమండలి



**దండేపల్లి, సెప్టెంబర్ 13 (ప్రజాజ్యోతి):** మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని దండేపల్లి మండలం రెబ్బెనపల్లి హరిజన మత్స్య శాఖ సొసైటీ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన పాలకమండలి సభ్యులు స్థానిక శాసనసభ్యులు శ్రీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు.సొసైటీ నూతన అధ్యక్షులు మొదంపల్లి లింగయ్య, ఉపాధ్యక్షులు కుశానపల్లి రాజం, ప్రధాన కార్యదర్శి కుశానపల్లి నర్సయ్యతో పాటు డైరెక్టర్లు రాజయ్య, రాజలింగు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించిన నూతన పాలకమండలి సభ్యులకు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి కట్టుబడి పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందుల అశోక్, ఉప సర్పంచ్ ఊరటి వినోద్ కుమార్, మాజీ సర్పంచ్ కొట్టే సత్తయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు కొట్టే శ్రీనివాస్, బండ రాకేష్, ాాజా డైరెక్టర్ జాడి పోచయ్య పాల్గొన్నారు. అలాగే అంబేద్కర్ సంఘ సభ్యులు కుష్ణపల్లి చిన్నయ్య, శేర్ల మురళి, కుశనపల్లి రంజిత్, కుష్ణపల్లి పెద్ద చిన్నయ్య, గ్రామ నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్--63 అలైన్‌మెంట్ మార్చాల్సిందే

**రైతులకు అండగా ఉంటా.. ప్రాణం ఉన్నంతవరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణాన్ని అడ్డుకుంటా**

**మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు**







**.మంచిర్యాల, 13, సెప్టెంబర్ (ప్రజా జ్యోతి):** నేషనల్ హైవే--63 రహదారి అలైన్‌మెంట్‌ను 2023 గెజిట్ ప్రకారం మార్చాలని కోరుతూ హాజీపూర్, లక్షెట్టిపేట మండలాలకు చెందిన వందలాది మంది బాధిత రైతులు ఆదివారం మంచిర్యాలలోని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు నివాసంలో ఆయనను కలిసి తమ సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. ప్రతిపాదిత రహదారి అలైన్‌మెంట్ కారణంగా తమ భూములు మొత్తం రహదారిలోనే పోతున్నాయని, ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు బాధితులుగా ఉన్న తమ కుటుంబాలు మరోసారి తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది రాజకీయ దళారుల స్వార్థ ప్రయోజనాల కోసం రహదారి అలైన్‌మెంట్‌ను మార్చారని రైతులు ఆరోపించారు. రాజకీయ కుట్రలను ఛేదించి సన్నకారు రైతులమైన తమకు అండగా నిలిచి, 2023 గెజిట్ ప్రకారం రహదారి అలైన్‌మెంట్‌ను మార్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను వేడుకున్నారు. రైతుల సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు వారికి భరోసా కల్పించారు. రైతులందరూ ఐకమత్యంగా ఉండి పోరాడితే రహదారి అలైన్‌మెంట్ మార్పు సాధ్యమవుతుందని అన్నారు. "నా ప్రాణం ఉన్నంతవరకు రైతులకు అన్యాయం చేసే విధంగా 2024 అలైన్‌మెంట్ ప్రకారం గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం జరగనివ్వను" అని స్పష్టం చేస్తూ రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే వెంటనే మంచిర్యాల ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడి రైతులకు జరుగుతున్న అన్యాయంపై తీవ్రంగా స్పందించారు. గ్రామసభలు నిర్వహించకుండా, రహదారి ఎక్కడి నుంచి ఎటు వెళ్తుందనే పూర్తి సమాచారాన్ని రైతులకు తెలియజేయకుండా నోటీసులు జారీ చేయడం సరికాదని అన్నారు. అమాయక రైతుల జీవితాలతో ఆటలాడవద్దని అధికారులను హెచ్చరించారు. రైతులకు పూర్తిస్థాయి సమాచారం అందించి, గ్రామసభలు నిర్వహించే వరకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను నిలిపివేయాలని సూచించారు. ఎమ్మెల్యే హామీతో కొంతవరకు ఉపశమనం పొందిన బాధిత రైతులు ఊపిరి పీల్చుకున్నారు. తమ సమస్యపై వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రైతు జేఏసీ నాయకులు లగిశెట్టి రాజమౌళి మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు ఇచ్చిన హామీతో తమకు ధైర్యం వచ్చిందన్నారు. ఇప్పటికైనా గతంలో తమను మోసం చేసిన రాజకీయ నాయకులు తిరిగి రాజకీయ కుట్రలకు పాల్పడి రైతుల జీవితాలతో ఆడుకోవద్దని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎన్‌హెచ్--63 రహదారి అలైన్‌మెంట్‌ను సవరించాలని కోరారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న కిష్టాపూర్,కామన్ పెల్లి ఉపాధ్యాయులు



**జన్నారం,సెప్టెంబర్13(ప్రజాజ్యోతి)** జన్నారం మండలంలోని కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్ కొట్టే రాజన్న, ఏదులాపురం గోవర్ధన చారి మరియు కామన్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్ బాధావత్ ప్రకాష్ నాయక్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న కొట్టే రాజన్న, ఏదులాపురం గోవర్ధన చారి , బాదావత్ ప్రకాష్ నాయక్ లను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ఈ అవార్డు తమపై మరింత బాధ్యత పెంచిందని, విద్యార్థులను అన్ని రంగాలలో ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులందుకున్న ఉపాధ్యాయులు తెలిపారు.

## గోమాతకు జాతీయ మాత హోదా కల్పించాలి

**గో హత్య నివారణకు సంతకాల సేకరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**



**ఆసిఫాబాద్, సెప్టెంబరు 13,(ప్రజా జ్యోతి** గోమాతకు జాతీయ మాత హోదా కల్పించి, గో హత్యను అరికట్టేందుకు చేపట్టిన గో సమ్మాన్ అభియాన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్వామీజీ పిలుపునిచ్చారు. ఆదివారం బ్రహ్మనవాడ కేశవనాథ్ ఆలయం, కంచికోట హనుమాన్ ఆలయంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన గోభక్తులు, గోప్రేమికులను ఉద్దేశించి మాట్లాడారు.గోమాత భారతీయ సంస్కృతి, సనాతన ధర్మంలో పవిత్ర స్థానాన్ని కలిగి ఉందన్నారు. గోమాతకు జాతీయ మాత హోదా కల్పించడంతోపాటు గో హత్యను పూర్తిగా అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ తరాలకు గోమాతను కాపాడి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.గో సమ్మాన్ అభియాన్‌లో భాగంగా చేపడుతున్న సంతకాల సేకరణను విస్తృతం చేయాలని కోరారు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, తెలంగాణ ముఖ్యమంత్రికి ప్రజల ఆకాంక్షను తెలియజేసేలా గోభక్తులు సంతకాలు చేయాలన్నారు. ఒక్కొక్కరు ఒక ఫారం తీసుకుని 59 మంది గోప్రేమికుల సంతకాలను మొబైల్ నంబర్లతో సహా సేకరించి అందించాలని సూచించారు.అనంతరం కేశవనాథ్ ఆలయ ప్రధాన పూజారి నరేశ్ సంతకాల సేకరణకు సంబంధించిన పత్రాలు, కరపత్రాలను స్వీకరించి మద్దతు తెలిపారు. స్వామీజీ, ఆయన శిష్యులను కాలనీవాసులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఖాండ్రే విశాల్, ప్రవీణ్ దేశ్‌ముఖ్, సువర్ణ, స్వప్న, సంతోష్, సాయి, కృష్ణ, రాయేశ్వర్‌రావు మసాదే తదితరులు పాల్గొన్నారు.కావాలంటే దిశ మొదటి పేజీకి మరింత పదునైన 3 హెడ్‌లైన్లు కూడా ఇస్తాను.

## NEET లో సత్తా చాటిన గిరిజన విద్యార్థిని ప్రత్యూష




**బెజ్జూర్ సెప్టెంబర్13 (ప్రజా జ్యోతి):** మండలంలోని లంబా డిగూడ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని లావుడ్యా ప్రత్యూష లో ఘన విజయం సాధించింది. కేటగిరీలో 2976 ర్యాంకు సాధించి మెదక్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు పొందింది. చిన్ననాటి నుండే వైద్యురాలు కావాలనే లక్ష్యంతో పట్టుదలతో చదివిన ఆమెకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం తోడైంది. భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి పేదలు, గిరిజనులు, గ్రామీణ ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని ప్రత్యూష తెలిపింది.ఆమె విజయంపై గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## పండుగ సందర్భంగా వాయిదా పడ్డ ప్రజావాణి....

**బెజ్జూర్ 13 సెప్టెంబర్ (ప్రజా జ్యోతి):**గణేష్ చతుర్థి సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్నందుకు, అధికారులు ఎవరు అందుబాటులో ఉండరు కనుక, రేపు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడదు. మళ్ళీ తిరిగి వచ్చే సోమవారం రోజున ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ బండారి ప్రవీణ్ తెలిపారు. వచ్చే సోమవారం ఈ కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని తెలియ జేశారు

## తుడుం దెబ్బ మండల అధ్యక్షుడిగా వసంత్




**జన్నారం,సెప్టెంబర్13(ప్రజాజ్యోతి)** ఆదివాసి హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జన్నారం మండల నూతన అధ్యక్షుడిగా మర్స్ కోల వసంత్ ను, మండల ఆదివాసి విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా తుమ్రం లక్ష్మణ్ లను తుడుం దెబ్బ కార్య నిర్వాహక అధ్యక్షుడు కుర్సెంగ బాబురావు, జిల్లా అధ్యక్షుడు పెంద్రం హనుమంతు, జిల్లా కార్యదర్శి కోడప అనంతరావు, రాయి సెంటర్ సెర్మడి జన్నారం పూసం సోనేరావు ల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, విద్య, ఉపాధి, అభివృద్ధి, సంక్షేమం కోసం తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఆదివాసి విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన అధ్యక్షుల ఎన్నిక పట్ల ఆదివాసి సంఘాల నాయకులు, విద్యార్థులు, యువత హర్షం వ్యక్తం చేస్తూ వారికి అభినందనలు తెలిపారు.

## పండుగ రద్దీకి ప్రత్యేక రైళ్లు

**సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఏ. శ్రీధర్**

**సికింద్రాబాద్--సిర్పూర్ కాగజ్‌నగర్, సిర్పూర్ కాగజ్‌నగర్--హైదరాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు**



**మంచిర్యాల, 13, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** పండుగల సీజన్‌లో ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గించేందుకు సికింద్రాబాద్ సిర్పూర్ కాగజ్‌నగర్, సిర్పూర్ కాగజ్‌నగర్--హైదరాబాద్ మధ్య రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఏ. శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే పత్రికా ప్రకటన విడుదల చేసింది. పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని 07035/07036 నంబర్లతో రెండు ప్రత్యేక రైళ్లను సెప్టెంబర్ 14న ఒక్కో ట్రిప్ చొప్పున నడపనున్నట్లు ఏ. శ్రీధర్ వెల్లడించారు. 07035 నంబర్ సికింద్రాబాద్--సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రత్యేక రైలు సెప్టెంబర్ 14న మధ్యాహ్నం 12.10 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ నుంచి బయలుదేరి సాయంత్రం 5.30 గంటలకు సిర్పూర్ కాగజ్‌నగర్ చేరుకుంటుంది. ఈ రైలు మార్గమధ్యంలో చర్లపల్లి, భువనగిరి, జనగామ, కాజీపేట, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, ఆసిఫాబాద్ రోడ్ స్టేషన్లలో ఆగుతుంది. అదేవిధంగా 07036 నంబర్ సిర్పూర్ కాగజ్‌నగర్--హైదరాబాద్ ప్రత్యేక రైలు సెప్టెంబర్ 14న సాయంత్రం 6.00 గంటలకు సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి బయలుదేరి రాత్రి 11.15 గంటలకు హైదరాబాద్ డెక్కన్ చేరుకుంటుంది. ఈ రైలు ఆసిఫాబాద్ రోడ్, బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, జమ్మికుంట, కాజీపేట, జనగామ, భువనగిరి, చర్లపల్లి, సికింద్రాబాద్ స్టేషన్ల మీదుగా హైదరాబాద్ చేరుతుంది.

**స్టేషన్ల వారీగా రైళ్ల సమయాలు..**

07035 సికింద్రాబాద్--సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రత్యేక రైలు: సికింద్రాబాద్ నుంచి 12.10 గంటలకు బయలుదేరి చర్లపల్లికి 12.30--12.32, భువనగిరికి 12.59--1.00, జనగామకు 1.29--1.30, కాజీపేటకు 2.23--2.25, జమ్మికుంటకు 3.00--3.01, పెద్దపల్లికి 3.30--3.31, రామగుండంకు 3.49--3.50, మంచిర్యాలకు 4.11--4.12, బెల్లంపల్లికి 4.30--4.31, ఆసిఫాబాద్ రోడ్‌కు 4.45--4.46 గంటలకు చేరుకుని, చివరగా సిర్పూర్ కాగజ్‌నగర్‌కు సాయంత్రం 5.30 గంటలకు చేరుకుంటుంది. 07036 సిర్పూర్ కాగజ్‌నగర్--హైదరాబాద్ ప్రత్యేక రైలు: సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి సాయంత్రం 6.00 గంటలకు బయలుదేరి ఆసిఫాబాద్ రోడ్‌కు 6.14--6.15, బెల్లంపల్లికి 6.35--6.36, మంచిర్యాలకు 6.56--6.57, రామగుండంకు 7.10--7.11, పెద్దపల్లికి 7.30--7.31, జమ్మికుంటకు 8.00--8.01, కాజీపేటకు 8.33--8.35, జనగామకు 9.19--9.20, భువనగిరికి 9.54--9.55, చర్లపల్లికి 10.23--10.25, సికింద్రాబాద్‌కు 10.45--10.50 గంటలకు చేరుకుని, హైదరాబాద్ డెక్కన్‌కు రాత్రి 11.15 గంటలకు చేరుకుంటుంది. ఈ రెండు ప్రత్యేక రైళ్లు ఒక్కో సర్వీసు చొప్పున సెప్టెంబర్ 14న నడుస్తాయి. 07035 రైలు సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్‌కు, 07036 రైలు సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్ డెక్కన్‌కు సేవలు అందించనున్నాయి. ఈ ప్రత్యేక రైళ్లలో రిజర్వ్‌డ్ ఏసీ చైర్‌కార్ (రాజ జమ్మిఅతీ ఋతీ), అన్‌రిజర్వ్‌డ్ జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఏ. శ్రీధర్ తెలిపారు. పండుగల సమయంలో ప్రయాణికుల అదనపు రద్దీని నియంత్రించడంతో పాటు, సికింద్రాబాద్, హైదరాబాద్ నుంచి మంచిర్యాల, బెల్లంపల్లి, ఆసిఫాబాద్ రోడ్, సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రాంతాలకు, అలాగే ఆయా ప్రాంతాల నుంచి హైదరాబాద్ వైపు ప్రయాణించే వారికి ఈ ప్రత్యేక రైళ్లు ఉపయోగకరంగా ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు.

## బియ్యం అక్రమ రవాణా వ్యవహారంలో బెజ్జూరు ఎస్సైపై చర్యలు

**జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేసినట్లు సమాచారం**

**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి** రాయితీ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో బెజ్జూరు ఎస్సై సరాజ్ పాషాను జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేసినట్లు సమాచారం. ఈ మేరకు ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది.రాయితీ బియ్యం అక్రమ రవాణా వ్యవహారంలో ఎస్సై పాత్రపై అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై విచారణ కొనసాగుతున్న సమయంలో ఎస్సైకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై కొందరు వ్యక్తులు అధికారుల దృష్టికి ఆధారాలను తీసుకెళ్లినట్లు సమాచారం.ఈ ఆరోపణలు, ఫిర్యాదులపై అధికారులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. విచారణ పూర్తయ్యే వరకు ఎస్సైను జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేసినట్లు పోలీసు వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారం ప్రస్తుతం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, ఎస్సైను జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేసిన విషయం వాస్తవమేనని కోటాల సీఐ వెల్లడించినట్లు సమాచారం. అయితే చర్యలకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.వారు పేర్కొన్నారు

## హుండీ లెక్కింపు





**బోథ్, సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి)** మండలంలోని కనుగుట్ట గ్రామ శబరి మాత ఆలయ హుండీ ఆదాయాన్ని భక్తుల సమక్షంలో శబరిమాత కమిటీ సభ్యులు లెక్కించారు. ఇటీవల అఖండ జ్యోతి కార్యక్రమాన్ని నెల రోజులపాటు గ్రామంలో నిర్వహించారు. నియమనిష్టలతో గ్రామం మొత్తం నెలరోజులపాటు మాంస హారాలకు దూరంగా చెప్పులు సైతం ధరించకుండా గ్రామం మొత్తం ఏకతాటిపై ఉండి ఆధ్యాత్మికత ఉట్టిపడేలా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఉమ్మడి జిల్లా నుండే కాకుండా పక్క రాష్ట్రమైన మహారాష్ట్ర నుండి సైతం భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి అఖండ జ్యోతిని దర్శించుకున్నారు. వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చిన సౌకర్యాలలో ఎటువంటి కొరత రాకుండా నిత్య అన్నదానం చేస్తూ శబరిమాత సేవలో తరిస్తూ నామస్మరణను ప్రపంచవ్యాప్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి దర్శించుకున్న భక్తులు కానుకల రూపంలో ఐదు లక్షల 85 వేల రూపాయలను సమర్పించినట్లుగా తెలిపారు. అనంతరం శబరిమాత కమిటీ వారు మాట్లాడుతూ అఖండ జ్యోతి అనే గొప్ప పుణ్య కార్యాన్ని తాము నిర్వహించడం జీవితంలో మర్చిపోలేని అనుభూతి అని పేర్కొన్నారు. గ్రామస్తుల సమిష్టి కృషి ఐక్యతతో సాధ్యమైనట్లుగా తెలిపారు. ఆధ్యాత్మికతనే అన్ని సమస్యలకు పరిష్కారమని, అలాగే మానసిక ప్రశాంతత తో పాటుగా మానవీయ సంబంధాల అనుబంధాలను పెంపొందించే గొప్ప కార్యక్రమమని తెలిపారు. ఈ కార్యక్రమంలో శబరిమాత కమిటీ సభ్యులు, గ్రామస్తులు మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పవిత్ర రామాలయ ప్రాంగణంలో రూ.30 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం

## భక్తి శ్రద్ధల మధ్య శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు







**మంచిర్యాల, సెప్టెంబర్ 13 (ప్రజాజ్యోతి):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ (పాత మంచిర్యాల)లో గల అతి పురాతనమైన, ఎంతో విశిష్టమైన పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీ రామాలయం--శివాలయం--భక్త ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో భక్తి శ్రద్ధల మధ్య కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు మంచిర్యాల శాసనసభ్యులు శ్రీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.30 లక్షల వ్యయంతో ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టనున్నారు. పురాతన కాలం నుంచి ఆధ్యాత్మికతకు, భక్తి విశ్వాసాలకు నిలయంగా ఉన్న శ్రీ రామాలయం--శివాలయం--భక్త ఆంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం పట్ల స్థానిక ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. దేవాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తి వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, శ్రీ రామాలయం వంటి పవిత్రమైన దేవస్థాన ప్రాంగణంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం తన అదృష్టంగా, భగవంతుడి ఆశీస్సుగా భావిస్తున్నానని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ, మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా ప్రజల ఐక్యతకు, సామాజిక సేవా కార్యక్రమాలకు వేదికలుగా నిలుస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలను ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాల ప్రాధాన్యతను ఆయన వివరించారు. ప్రకృతికి హాని కలిగించని మట్టి గణపతులను పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తూ, ప్రకృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్న కుమ్మరి సంఘం కృషిని ఎమ్మెల్యే అభినందించారు. వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, స్థానిక కార్పొరేటర్ తూముల నరేష్ ఆధ్వర్యంలో డివిజన్ నాయకులు, స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సల్ల మహేష్, కార్పొరేటర్లు, జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు, మార్కెట్ డైరెక్టర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ఆలయ భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతే.. మహా గణపతి

### 200 బంకమట్టి వినాయకుల ఉచిత పంపిణీ

### ప్రకృతిమిత్ర తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుండేటి యోగేశ్వర్

**మంచిర్యాల, 13 సెప్టెంబర్ (ప్రజా జ్యోతి):** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ) విగ్రహాలకు బదులుగా బంకమట్టి వినాయక విగ్రహాలను పూజించాలని ప్రకృతిమిత్ర తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర ప్రభుత్వ పర్యావరణ అథారిటీ పర్యావరణవేత్త గుండేటి యోగేశ్వర్ పిలుపునిచ్చారు. ప్రకృతిమిత్ర తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్ రోడ్డులోని టీఎన్జీవోస్ కాలనీలో శ్రీ సిద్ధి వినాయక గణేష్ మండలి ఆవరణలో ఆయన ఆధ్వర్యంలో 200 బంకమట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుండేటి యోగేశ్వర్ మాట్లాడుతూ జలాశయాలు, జీవవైవిధ్యం, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం మన పూర్వీకులు పూజించిన బంకమట్టి వినాయకుడినే ప్రతి ఒక్కరూ పూజించాలని అన్నారు. మట్టి గణపతిని పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు మన సంప్రదాయాలను కొనసాగించినట్లవుతుందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల నీటిలో అవక్షేపాలు ఏర్పడి ఆక్సిజన్ స్థాయి తగ్గి జలాలు కలుషితమవుతాయని తెలిపారు. ఈ కారణంగా నీటిపై ఆధారపడే పక్షులు, ఇతర జీవరాశులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. విష రసాయనాలతో విగ్రహాల తయారీ వల్ల వాటిని తయారు చేసే కార్మికులు కూడా అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని వివరించారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని ఆయన సూచించారు. మహిళలు ప్లాస్టిక్ బుట్టలకు బదులుగా స్టీల్, వెదురు బుట్టలను ఉపయోగించాలని, ప్రసాద వితరణలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులుగా ఆకు దొప్పలు, స్టీల్ పాత్రలను వినియోగించాలని కోరారు. "మట్టి గణపతే మహా గణపతి.. పీఓపీ వద్దు.. బంకమట్టి వినాయకుడే ముద్దు" అని గుండేటి యోగేశ్వర్ ప్రజలకు పిలుపునిచ్చారు. టీఎన్జీవోస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి మాట్లాడుతూ, శ్రీ సిద్ధి వినాయక గణేష్ మండలి ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను సింగిల్ యూజ్ ప్లాస్టిక్ లేకుండా పర్యావరణహిత పదార్థాలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రకృతిమిత్ర తెలంగాణ ఆధ్వర్యంలో బంకమట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేసిన గుండేటి యోగేశ్వర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. నెక్స్ ఐరా ఐటీ కంపెనీ ఎండీ మోతే




శరత్ చంద్ర మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం నిర్వహించిన ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ ముఖ్య నాయకులు పొన్న మల్లయ్య, శ్రీపతి బాబురావు, బి. రామ్మోహన్, కే. నాగేశ్వరరావు, ఎస్. మొండయ్య, ఎన్. సత్యనారాయణ, టీ. తిరుపతి, జి. వెంకటేశం, ప్రకృతిమిత్ర సభ్యులు, టీఎన్జీవోస్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

# వినాయక చవితి సందడితో కిక్కిరిసిన మంచిర్యాల మార్కెట్లు

## విగ్రహాలు.. పూలు.. పండ్లు.. పత్రులతో పండుగ శోభ ధరలు చూసి అవాక్కైన భక్తులు

## మట్టి గణపతుల పంపిణీతో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

**మంచిర్యాల, 13, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** వినాయక చవితి పర్వదినం సందర్భంగా మంచిర్యాల పట్టణం పండుగ శోభను సంతరించుకుంది. గణనాథుడిని ఇంటికి ఆహ్వానించి భక్తిశ్రద్ధలతో పూజించేందుకు ప్రజలు ఆదివారం పెద్ద సంఖ్యలో మార్కెట్లకు తరలిరావడంతో పట్టణంలోని ప్రధాన వ్యాపార ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. కూరగాయల మార్కెట్, రాంనగర్, లక్ష్మీ టాకీస్, ముకరం చౌరస్తా తదితర ప్రాంతాల్లో ఎటుచూసినా వినాయక విగ్రహాలు, పూలు, పండ్లు, పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులతో సందడి నెలకొంది. వినాయక విగ్రహాలు, పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు కుటుంబ సమేతంగా ప్రజలు మార్కెట్లకు రావడంతో రహదారులపై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు రద్దీని నియంత్రించేందుకు చర్యలు చేపట్టారు.

### రూ.150 నుంచి రూ.6 వేల వరకు గణనాథుడి విగ్రహాలు

వినాయక విగ్రహాల కొనుగోలులోనూ భక్తుల ఆసక్తి కనిపించింది. చిన్న విగ్రహాల నుంచి భారీ రంగుల విగ్రహాల వరకు వివిధ ఆకృతులు, రూపాల్లో విగ్రహాలు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. సైజు, ఆకృతి, అలంకరణను బట్టి రూ.150 నుంచి రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు విగ్రహాలను వ్యాపారులు విక్రయించారు. తమ స్థోమతకు అనుగుణంగా భక్తులు గణనాథుడి విగ్రహాలను ఎంపిక చేసుకుని కొనుగోలు చేశారు. మట్టి వినాయకులకు కూడా ఈసారి మంచి ఆదరణ కనిపించింది. మంచిర్యాల చుట్టుపక్కల గ్రామాలతో పాటు చెన్నూరు, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా గ్రామీణ ప్రాంతాలు, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి మట్టి విగ్రహాలను తీసుకొచ్చి విక్రయించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని పలువురు భక్తులు మట్టి గణపతులనే ఎంపిక చేసుకున్నారు.

### మూషిక వాహనాలకూ డిమాండ్

గణనాథుడి విగ్రహంతో పాటు ఆయన వాహనమైన మూషికుడు (ఎలుక) ప్రతిమలను కూడా భక్తులు కొనుగోలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఎద్దులు, ఇతర చిన్న ప్రతిమలు, అలంకరణ వస్తువులు కూడా విక్రయించారు. మూషికుడు, ఇతర చిన్న ప్రతిమలను రూ.10 నుంచి రూ.20 వరకు, చిన్న విగ్రహాలను రూ.100 నుంచి రూ.200 వరకు విక్రయించారు. గణపతి పూజలో ప్రకృతి, జీవరాశులకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఉందని పండితులు చెబుతున్నారు. గణనాథుడి పురాణ కథలు, అలంకరణల్లో మూషికుడు, నెమలి, హంస, చిలుక, గరుడుడు తదితర పక్షులు, జీవరాశుల ప్రస్తావనలు కనిపిస్తుంటాయని వారు పేర్కొంటున్నారు. ప్రకృతిలోని ప్రతి జీవరాశిని గౌరవించాలనే సందేశం ఇందులో అంతర్లీనంగా ఉందని వివరిస్తున్నారు.

### పండ్ల ధరలకు రెక్కలు.. అయినా తప్పని కొనుగోలు

గణపతి పూజలో పండ్లు, పూలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండటంతో వాటి కొనుగోళ్లు భారీగా సాగాయి. ధరలు పెరిగినప్పటికీ పూజా సామగ్రి కొనుగోలు చేయక తప్పని పరిస్థితి నెలకొంది. ఆపిల్ రకాన్ని బట్టి కిలో రూ.100 నుంచి రూ.200 వరకు, ద్రాక్ష కిలో రూ.200 వరకు, అరటి పండ్లు డజన్‌కు రూ.60 నుంచి రూ.80 వరకు, బత్తాయి కిలో రూ.150 వరకు విక్రయించారు.

పూల ధరలు కూడా పెరిగాయి. బంతి, చామంతి, గులాబీ, మల్లె తదితర పూలకు డిమాండ్ పెరగడంతో మూర, కిలో చొప్పున రూ.100 నుంచి రూ.300 వరకు ధరలు పలికాయి. గణనాథుడి పూజకు అవసరమైన వివిధ రకాల పత్రి, చెరుకు గడలు, అరటి



ఆకులు, కలువ పువ్వులు తదితర పూజా సామగ్రిని కలిపి రూ.150 నుంచి రూ.300 వరకు విక్రయించారు.

### కొబ్బరికాయ ధరా కొండెక్కింది........

వినాయక పూజలో తప్పనిసరిగా ఉపయోగించే కొబ్బరికాయ ధర కూడా భక్తులకు భారంగానే మారింది. ఒక్కో కొబ్బరికాయను రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయించడంతో ధరలు చూసి ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. అయినప్పటికీ గణనాథుడి పూజలో ఎలాంటి లోటు రాకూడదనే ఉద్దేశంతో భక్తులు అవసరమైన పూజా సామగ్రిని కొనుగోలు చేశారు.

### గ్రామీణ ప్రాంతాల నుంచి పూజా సామగ్రి

మంచిర్యాల పట్టణ మార్కెట్లకు పూలు, పండ్లు, పత్రి, చెరుకు, అరటి ఆకులు, కలువ పువ్వులు తదితర పూజా సామగ్రి మంచిర్యాల పరిసర ప్రాంతాల నుంచే కాకుండా చెన్నూరు, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా గ్రామీణ ప్రాంతాలు, మహారాష్ట్రలోని పలు పల్లెల నుంచి కూడా తీసుకొచ్చి విక్రయించారు. దీంతో మార్కెట్లలో ప్రత్యేకంగా పండుగ వాతావరణం నెలకొంది.

### పత్రితో గణనాథుడికి పూజ

వినాయక పూజలో పత్రికి ఎంతో ప్రాధాన్యం ఉంది. సంప్రదాయంగా వివిధ రకాల పత్రులతో గణపతిని పూజించడం ఆనవాయితీ. మారేడు, జమ్మి, దూర్వ, జిల్లేడు, రావి, మామిడి, వేప, వెలగ, తులసి తదితర పత్రులను భక్తులు పూజలో ఉపయోగిస్తారు. పూలతో పాటు వివిధ రకాల ఆకులు, పత్రులు ఉపయోగించడం ద్వారా మన పండుగ సంప్రదాయాల్లో ప్రకృతికి ఉన్న ప్రాధాన్యం స్పష్టమవుతుందని పండితులు చెబుతున్నారు.

### నేడు వినాయక చవితి.. ఇళ్లలో మొదలుకానున్న సందడి

గణేష్ చతుర్థి వచ్చిందంటే ప్రతి ఇంట్లో సందడి మొదలవుతుంది. సెప్టెంబర్ 14న వినాయక చవితి సందర్భంగా అనేక కుటుంబాలు గణనాథుడిని ఇంటికి తీసుకువచ్చి భక్తిశ్రద్ధలతో పూజించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఇంట్లో ప్రతిష్ఠించుకునే వినాయక విగ్రహం విషయంలో సంప్రదాయానికి అనుగుణంగా ప్రశాంతమైన ముఖంతో, శుభప్రదమైన రూపంలో ఉన్న విగ్రహాన్ని ఎంపిక చేసుకోవాలని పండితులు సూచిస్తున్నారు. వీలైనంత వరకు పర్యావరణానికి హాని కలిగించని మట్టి గణపతిని ప్రతిష్ఠించడం మంచిదని చెబుతున్నారు. విగ్రహాన్ని ఇంటిలో శుభ్రమైన ప్రదేశంలో పీటపై ఉంచి, పసుపు, కుంకుమ, అక్షింతలు, పూలతో అలంకరించి పూజించాలి. విగ్రహాన్ని నేలపై నేరుగా ఉంచకుండా పూజా పీటపై ప్రతిష్ఠించడం సంప్రదాయంగా పాటిస్తున్నారు.

### పూజా ముహూర్తంలోనే ప్రతిష్ఠ.. భక్తిశ్రద్ధలతో ఆరాధన

పండితుల సూచనల మేరకు వినాయక చవితి రోజున శుభసమయంలో గణనాథుడిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించడం ఆనవాయితీ. కుటుంబ సభ్యులంతా కలిసి సంకల్పం చేసుకుని, గణపతి అష్టోత్తరం, గణేశ స్తోత్రాలు, గణపతి కథ, హారతి తదితరాలను నిర్వహించాలని పండితులు సూచిస్తున్నారు. పూజలో ఉండ్రాళ్లు, కుడుములు, మోదకాలు, పండ్లు, పూలు, కొబ్బరికాయతో



పాటు వివిధ రకాల పత్రులను సమర్పించడం సంప్రదాయం. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి గణనాథుడి ఆశీస్సులు పొందాలని పండితులు సూచిస్తున్నారు.

### మట్టి గణపతుల పంపిణీలో సింగరేణి ముందడుగు

ఇదిలా ఉండగా.. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో కార్మిక కుటుంబాలకు మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణతో పాటు సంప్రదాయబద్ధంగా వినాయక చవితిని నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే ప్రకృతిమిత్ర తెలంగాణ ఆధ్వర్యంలోనూ ఉచిత మట్టి గణపతులను పంపిణీ చేశారు . అదేవిధంగా ప్రకృతిమిత్ర తెలంగాణ ఆధ్వర్యంలో టీఎన్‌జీవోస్ కాలనీలోని శ్రీ సిద్ధి వినాయక గణేష్ మండలి వద్ద భక్తులకు ఉచితంగా మట్టి గణేష్ విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను పూజించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసారి మంచిర్యాల పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో అనేక స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, గణేష్ మండళ్లు కూడా మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాలను చేపట్టడం విశేషం. ఉచితంగా మట్టి గణపతులను అందిస్తూ ప్రజలను పర్యావరణహిత పూజా విధానాల వైపు ప్రోత్సహించారు.

### భక్తి.. పర్యావరణ పరిరక్షణ రెండూ కలిసేలా

వినాయక చవితి సందర్భంగా ఒకవైపు మార్కెట్లలో విగ్రహాలు, పూలు, పండ్లు, పత్రి, కొబ్బరికాయల కొనుగోళ్లతో సందడి నెలకొనగా.. మరోవైపు మట్టి గణపతుల ఉచిత పంపిణీ కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణకు కొత్త సందేశాన్ని అందించాయి. భక్తి విశ్వాసాలకు ఎలాంటి లోటు లేకుండా ప్రకృతిని కాపాడే విధంగా పండుగను జరుపుకోవాలనే చైతన్యం ప్రజల్లో పెరుగుతున్నట్లు ఈ కార్యక్రమాలు చాటిచెప్పాయి. ధరలు పెరిగినా.. భక్తి మాత్రం తగ్గలేదు ...మార్కెట్లో పండ్లు, పూలు, కొబ్బరికాయలు, పత్రి, పూజా సామగ్రి ధరలు పెరిగినప్పటికీ గణనాథుడిపై భక్తి మాత్రం తగ్గలేదు. "గణనాథుడి పూజ ఒక్కసారే.. భక్తితో చేయాలి" అన్న భావనతో ప్రజలు తమకు కావాల్సిన పూజా సామగ్రిని కొనుగోలు చేసుకున్నారు. మొత్తంగా మంచిర్యాల పట్టణంలో వినాయక చవితి సందడి అంబరాన్ని తాకింది. మార్కెట్లు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోగా.. గణనాథుడి విగ్రహాలు, పూలు, పండ్లు, పత్రి, పూజా సామగ్రి కొనుగోళ్లు జోరుగా సాగాయి. ధరలు భక్తులను ఒకింత ఆందోళనకు గురిచేసినా, గణనాథుడిపై ఉన్న భక్తి ముందు అవన్నీ చిన్నవిగానే మారాయి. మరోవైపు సింగరేణి యాజమాన్యం, ప్రకృతిమిత్ర తెలంగాణతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేయడం ద్వారా 'భక్తితో పండుగ.. ప్రకృతితో అనుబంధం' అనే సందేశాన్ని అందించడం ఈ ఏడాది వినాయక చవితి ప్రత్యేకతగా నిలిచింది.

# కోల్ ఇండియాలో పి.ఎల్.ఆర్. సమావేశానికి ముందే సింగరేణిలో లాభాలను ప్రకటించాలి

## సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు

**మంచిర్యాల, 13, సెప్టెంబర్ (ప్రజా జ్యోతి):** కోల్ ఇండియాలో పెర్ఫార్మన్స్ లింక్డ్ రివార్డ్ ( పి.ఎల్.ఆర్.) సమావేశానికి ముందే సింగరేణి లోని 2025-26 ఆర్థిక సంవత్సరం లాభాలను ప్రకటించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు డిమాండ్ చేశారు . అక్టోబర్ 3, 4 తేదీల్లో కోల్ ఇండియాలో పి.ఎల్.ఆర్. బోనస్‌పై అపెక్స్ కమిటీ సమావేశం జరిగే అవకాశం ఉన్నందున, ఆ సమావేశాలకు ముందే సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాలను ప్రకటించి అపెక్స్ కమిటీకి వెళ్లాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు అన్నారు . గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాలను మూడు నెలల ముందుగానే కోల్ ఇండియా ప్రకటించి, తమ కార్మికులకు చెల్లించాల్సిన బోనస్‌పై చర్చలు జరుపుతున్నప్పటికీ, సింగరేణి యాజమాన్యం ఇప్పటివరకు సంస్థకు వచ్చిన లాభాలను ప్రకటించకుండా గోప్యత పాటించడం సరికాదన్నారు. మీనమేషాలు లెక్కిస్తూ లాభాలను వెల్లడించకుండా అపెక్స్ కమిటీ సమావేశానికి వెళ్లి అక్కడ వెల్లడించడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. సింగరేణి సంస్థకు గత సంవత్సరం వచ్చిన లాభాలతో పాటు సంస్థకు రావాల్సిన బకాయిల వివరాలను కూడా కార్మికులకు, ప్రజలకు వెల్లడించాలని మంద నరసింహారావు డిమాండ్ చేశారు. అదేవిధంగా గత రెండు సంవత్సరాల్లో సంస్థ అభివృద్ధి కోసం పక్కన పెట్టిన రూ.6 వేల కోట్ల నిధులతో ఎంత మేర అభివృద్ధి పనులు చేపట్టారో స్పష్టంగా వెల్లడించాలని కోరారు. చారిత్రాత్మక ఒప్పందాలు చేసుకున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ఏఐటీయూసీ నాయకులు, చివరకు సింగరేణి సంస్థకు వచ్చిన లాభాలను సైతం యాజమాన్యం ప్రకటించేలా ఒత్తిడి తేవడంలో విఫలమయ్యారని ఆయన ఎద్దేవా చేశారు. గత 15 రోజులుగా చారిత్రాత్మక ఒప్పందాలంటూ ప్రచారం చేసుకుంటున్నారని, అయితే ఆ ఒప్పందాలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పేందుకు మాత్రం వెనకడుగు వేస్తున్నారని విమర్శించారు. దీంతో వారి లోపాయికారి ఒప్పందాలు బయటపడుతున్నాయని ఆరోపించారు. ఈ నెల 8వ తేదీతో గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో, తిరిగి ఎన్నికలు నిర్వహించేంత వరకు సింగరేణి యాజమాన్యం అన్ని యూనియన్లను సమానంగా చూడాల్సిన బాధ్యత సంస్థలోని ఐఏఎస్ అధికారులు, చైర్మన్ మరియు డైరెక్టర్ (పా)పై ఉందని మంద నరసింహారావు స్పష్టం చేశారు. కార్మికుల ప్రయోజనాలకు సంబంధించిన పి.ఎల్.ఆర్. బోనస్ విషయంలో ఎలాంటి గోప్యత లేకుండా సంస్థ ఆర్థిక పరిస్థితి, లాభాలు, బకాయిలు, అభివృద్ధి



నిధుల వినియోగంపై పూర్తి వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని ఆయన మరోసారి డిమాండ్ చేశారు.

# అసెంబ్లీ -2028 ఎన్నికల్లో తెలంగాణలో బీఎస్పీ సత్తా చాటాలి

## బూత్ స్థాయి వరకు పార్టీని పటిష్టం చేయాలి: మాజీ రాజ్యసభ సభ్యులు రాజారామ్

## రాష్ట్రస్థాయి ఈసీ సమావేశంలో పాల్గొన్న మంచిర్యాల జిల్లా నాయకులు







**మంచిర్యాల, 13, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** రాబోయే 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) సత్తా చాటేలా పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేయాలని 9 రాష్ట్రాల ఇంచార్జ్, మాజీ రాజ్యసభ సభ్యులు గౌ. రాజారామ్ సూచించారు. హైదరాబాద్‌లోని బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు గౌ. ఇబ్రాం శేఖర్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి ఈసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా 9 రాష్ట్రాల ఇంచార్జ్, మాజీ రాజ్యసభ సభ్యులు గౌ. రాజారామ్, 9 రాష్ట్రాల ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ గౌ. అతర్ సింగ్ రావు, 3 రాష్ట్రాల ఇంచార్జ్‌లు గౌ. సురేష్ ఆర్య, గౌ. మోహిత్ ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌ. రాజారామ్ మాట్లాడుతూ, తెలంగాణలో బీఎస్పీని బూత్ కమిటీల స్థాయి వరకు పూర్తిగా పటిష్టం చేసి, 2028 అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ శ్రేణులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు అందించే ఆర్థిక సహకారంతోనే బీఎస్పీ కొనసాగుతోందని తెలిపారు. దేశంలో బహుజన మహనీయుల ఆశయ సాధన కోసం నిరంతరం పనిచేస్తున్న ఏకైక పార్టీ బీఎస్పీ అని పేర్కొన్నారు. బేహెన్ మాయావతి నాయకత్వంలో మహాత్మా జ్యోతిబా ఫూలే, సాహు మహారాజ్, పెరియార్, నారాయణ గురు, బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మాన్యవర్ కాన్షీరాం వంటి మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు పార్టీ కృషి చేస్తోందన్నారు. అలాగే పార్టీ శ్రేణులంతా జన్ కళ్యాణ్ దివస్ కార్యక్రమాన్ని, అక్టోబర్ 9న పార్టీ వ్యవస్థాపకులు మాన్యవర్ కాన్షీరాం వర్ధంతి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కమిటీలను మరింత బలోపేతం చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ, 9 రాష్ట్రాల ఇంచార్జ్ గౌ. అతర్ సింగ్ రావు మాట్లాడుతూ, తెలంగాణలో పార్టీని బూత్, సెక్టార్ కమిటీల స్థాయి వరకు విస్తరించడం అభినందనీయమన్నారు. ఇప్పటి వరకు అన్ని జిల్లా కమిటీలు, అసెంబ్లీ కమిటీలు, పార్లమెంట్ కమిటీలు, జోన్ కమిటీలు పూర్తయ్యాయని తెలిపారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి బీఎస్పీని తెలంగాణలో మరింత బలోపేతం చేయాలని కోరారు. పార్టీలో గ్రూపులను ప్రోత్సహించే నాయకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం 3 రాష్ట్రాల ఇంచార్జ్‌లు గౌ. సురేష్ ఆర్య, గౌ. మోహిత్ ఆనంద్ రాష్ట్ర ఈసీ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభారీ బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, 4వ జోన్ చీఫ్ ఇంచార్జ్ శ్రీరామ్ కృష్ణ, చీఫ్ జోన్ ఇంచార్జ్‌లు దాగిళ్ల దయానంద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చీఫ్ జోన్ ఇంచార్జ్ బోడపట్ల ఈశ్వర్, నిషాని రాంచందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ధర్మేందర్, రవీందర్ నాయక్, పృథ్వీరాజ్, సైపుల్లా ఖాన్, ప్రశాంత్ గౌడ్, రాష్ట్ర కోశాధికారి ప్రణయ్, రాష్ట్ర కార్యదర్శులు లింగంపల్లి యాదగిరి, శీలం అనిత రెడ్డి, జోన్ ఇంచార్జ్‌లు, పార్లమెంట్ ఇంచార్జ్‌లు, జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లా నుంచి కూడా ఈ రాష్ట్ర స్థాయి సమావేశంలో బీఎస్పీ నాయకులు పాల్గొని పార్టీ బలోపేతం, రాబోయే ఎన్నికల కార్యాచరణపై చర్చల్లో పాల్గొన్నారు.

## మట్టి వినాయకుడిని పూజిద్దాం.. ప్రకృతిని కాపాడుదాం.



మందమర్రి, సెప్టెంబర్ 13(ప్రజాజ్యోతి ): మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీమొద్దీన్ కోరారు. 11వ వార్డులో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహా లకు బదులుగా మట్టి విగ్రహాలను వినియోగిస్తే నీటి కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. 'ఒక్క కుటుంబం.. ఒక్క మట్టి వినాయకుడు' అనే సంకల్పంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో జిల్లా అధ్యక్షుడు నందిపాటి రాజకుమార్, కార్యదర్శి గాండ్ల సంజీవ్ పటేల్, గోపాల్, చిలుముల రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీత రామాలయాన్ని సందర్శించిన ప్రముఖ యాంకర్ రమ్యకృష్ణ



లక్ష్మణ చాంద, సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి) మండలంలోని చామనపల్లి గ్రామంలో గల ప్రసిద్ధిగాంచిన సీతారాముల ఆలయాన్ని ప్రముఖ యాంకర్ రమ్యకృష్ణ, అలియాస్ రాములమ్మ వారు మై విలేజ్ షూటింగ్ కోసం వచ్చిన సందర్భంగా ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. వారికి గ్రామ సర్పంచ్ లక్ష్మీ సుదర్శన్, ఉప సర్పంచ్ గంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూజారి మధు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన నాయకులకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఘన సన్మానం

**ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో**
**ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్**



బాసర సెప్టెంబర్ 13 (ప్రజాజ్యోతి) నిర్మల్ జిల్లా అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన జంగం శశిధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నూతనంగా ఎన్నికైన నాయకులను ఘనంగా సన్మానించి అభినందించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ కోసం నాయకులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను విద్యార్థులు, యువతలోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. నూతన బాధ్యతల్లో సమర్థవం తంగా పనిచేసి విద్యార్థులకు, పార్టీకి మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# మట్టితోనే గణనాథుడి ప్రతిష్ఠ..

**బాసర బొర్ర గణేష్ ఆలయంలో 2014 నుంచి కొనసాగుతున్న సంప్రదాయం**




బాసర సెప్టెంబర్ 13 (ప్రజాజ్యోతి) బాసర వినాయక చవితి వచ్చిందంటే ప్రతి గ్రామంలోనూ గణనాథుడి విగ్రహాల ప్రతిష్ఠాపన సందడి కనిపిస్తుంది. అయితే బాసరలోని బొర్ర గణేష్ కాలనీలో ఉన్న గణేష్ ఆలయంలో మాత్రం అందుకు భిన్నమైన సంప్రదా యం కొనసాగుతోంది. ఏటా మట్టి వినాయకుడినే ప్రతిష్ఠించి పూజలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయి తీగా మారింది. భక్తి, సంప్రదాయంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ కొనసాగుతున్న ఈ విధానం పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.

**2014లో మొదలైన మట్టి గణపతి సంప్రదాయం**

ఆలయ అర్చకులు, భక్తుల ప్రోత్సాహంతో లి2014లో మమ్మాయి సచిన్ ఆధ్వర్యంలోలి బొర్ర గణేష్ కాలనీలోని ఆలయంలో మట్టి గణపతి విగ్రహాన్ని తయారు చేసి ప్రతిష్ఠించారు. కొన్ని సంవత్సరాల పాటు స్థానికంగానే మట్టి గణపతి విగ్రహాన్ని తయారు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రతి ఏడాది నిజామాబాద్ నుంచి మట్టి విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని తీసుకొచ్చి ఆలయంలో ప్రతిష్ఠిస్తున్నారు. అప్పటి నుంచి నేటి వరకు మట్టి గణపతికే ప్రత్యేక పూజలు నిర్వహించడం కొనసాగుతోంది. వినాయక చవితి సందర్భంగా మట్టి గణనాథుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, భజనలు, సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

**పర్యావరణ పరిరక్షణకు ప్రతీక**

మట్టి వినాయకుడిని పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని ఆలయ నిర్వాహకులు, పండితులు చెబుతున్నారు. మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కలిసిపోవడంతో నిమజ్జనం అనంతరం పర్యావరణంపై ప్రతికూల ప్రభావం తక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు. భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బాలకృష్ణ భాస్కర్ మహారాజ్ పేర్కొంటున్నారు. ప్రకృతిని పరిరక్షిస్తూ మట్టి గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజించాలని ఆయన సూచిస్తున్నారు.

**వందల ఏళ్ల చరిత్రకు సాక్షిగా..**

బొర్ర గణేష్ గల్లీలోని ఈ ఆలయానికి ప్రత్యేక చారిత్రక ప్రాధాన్యం ఉందని స్థానికులు చెబుతున్నారు. కొన్ని వందల సంవత్సరాలుగా ఇక్కడ రాతితో చెక్కిన గణపతి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్న రాతి గణపతిని దర్శించుకునేందు కు బాసరతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఆలయంలో గణపతితో పాటు నందీశ్వరు డు, నవగ్రహాలు, శివుడు, హనుమంతుడు తదితర దేవతామూర్తు లు కొలువుదీరారు. భక్తులు తమ మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.

**పర్వదినాల్లో ప్రత్యేక పూజలు**

సంకట చతుర్థి వినాయక చవితితో పాటు ఎడ్ల పొలాల అమావాస్య తదితర పర్వదినాలను కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని భజనలు, సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారుతోంది.

**బాసర గ్రామానికే ఆదర్శంగా..**

ఏటా మట్టి గణపతిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించడం ద్వారా బొర్ర గణేష్ ఆలయ కమిటీ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. సంప్రదాయాన్ని కొనసాగిస్తూనే ప్రకృతిని కాపాడాలనే సందేశాన్ని భక్తులకు అందిస్తోంది. 'పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. మట్టి గణపతిని పూజిద్దాం' అనే సందేశంతో కొనసాగుతున్న ఈ సంప్రదాయం బాసరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. భక్తి, సంప్రదాయం, పర్యావరణ పరిరక్షణను మేళవించిన బొర్ర గణేష్ ఆలయ మట్టి గణపతి వేడుకలు ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నాయి.

## భారతదేశంలో అందరూ సమానమే

**ఐక్యతతో అభివృద్ధి చేసు కుందాం**
**ఎమ్మెల్యే అనిల్ జాదవ్**
**గుడిహత్నూర్ లో ఎస్టీ కమ్యూనిటీ హాల్ కు ప్రారం భోత్సవం**





గుడిహత్నూర్, సెప్టెంబర్ 13, (ప్రజా జ్యోతి) భారతదేశంలో అందరూ సమానమైనని,ఐక్యతతో అభివృద్ధిని సాదించుకుం దామనిబోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపునిచ్చారు. మండలం లోని శాంతా పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎస్టీ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అన్నా మాకు దీపావళి వరకు క మ్యూనిటీ హాల్ కావాలని అడిగిన వెంటనే స్పందించి కచ్చితంగా దీపావళి కంటే ముందే నిర్మిస్తామని తెలిపి వినాయక చవితికి కమ్యూ నిటీ హాల్ మాకు అందుబా టులో తీసుకొచ్చారని కృత జ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఐక్య తతో అభివృద్ధి సాధ్యమని కచ్చితంగా గ్రామాన్ని అభి వృద్ధి చేస్తామని, ఏ అవసరం ఉన్నా అన్నా అని పలక రిస్తే అండగా ఉంటానన్నారు. నాడు కేసీఆర్ ముఖ్య మంత్రిగా చిన్న చిన్న గోండు గూడలను గ్రామ పంచాయ తీలుగా మార్చి మావ నా టే మావ రాజ్ నినాదాన్నినిజం చేశారన్నారు. ఆదివాసులు అభి వృద్ధి చెందాలని, వారు అడగకముందే అండగా నిలిచారని అన్నా రు. ఈకార్యక్రమంలో మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

## సరస్వతి కాలువ ద్వారా నీటి విడుదల



**లక్ష్మణ చాంద, సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి)** నిర్మల్ నియోజకవర్గ రైతులకు సాగునీటి సమస్య పరిష్కారంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కూచాడి శ్రీహరి రావు చేసిన ప్రత్యేక కృషికి సొన్, మామడ, లక్ష్మణ చాంద మండలాలతోపాటు ఖానాపూర్ వరకు రైతులకు సాగునీరు అందుతుంది. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని శ్రీహరి రావు టీపీసీ సీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఉత్తమ కుమార్ రెడ్డి, నీటి పారుదల శాఖ ఉన్నతాధి కారుల దృష్టికి సరస్వతి కాలువ నీటిని విడుదల చేయాలని శ్రీహరి రావు వారికి విజ్ఞప్తి చేశారు. ఆయన ప్రత్యేక కృషితో ఎస్ ఆర్ ఎస్పీ సరస్వతి కెనాల్ కు వారబంది పద్ధతిలో ఆదివారం రోజు నుండి సరస్వతి కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. నీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు కాలువ ద్వారా నీటి విడుదలతో ఉరట లభించింది.

## శివలాల్ కు ఘనంగా ఉద్యోగ విరమణ సన్మానం






**నేరడిగొండ, సెప్టెంబర్ 13 (ప్రజాజ్యోతి):** మండలంలోని ఇస్పూర్ (బి) ప్రభుత్వ పాఠశాలలో ఎస్జీటీ గా సుదీర్ఘ కాలం సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన రూపావత్ శివ లాల్ సన్మాన కార్యక్రమం ఆదివారం మండల కేంద్రంలోని సూర్య గార్డెన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్, శివ లాల్‌ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... దాదాపు 40 సంవత్సరాల సుదీర్ఘ సేవాకాలంలో శివ లాల్ ఎలాంటి మచ్చ లేకుండా విధులు నిర్వర్తించారని కొనియాడారు. క్రమశిక్షణ, అంకితభావంతో వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించారని ప్రశంసించారు. ఈ ఉద్యోగ విరమణ మహోత్సవంలో వివిధ మండలాల ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివ లాల్‌కు శుభాకాంక్షలు తెలపడమే కాకుండా ఆయన సేవలను కొనియాడారు.

## వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు

**డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు..**
**హెల్మెట్ తప్పనిసరి: సీఐ దీపక్**



**బాసర, సెప్టెంబర్ 13 (ప్రజాజ్యోతి)**బైంసా--నిజామాబాద్ జాతీయ రహదారిపై ట్రిపుల్ ఐటీ సమీపంలో ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ సాయికిరణ్ ఆదేశాల మేరకు వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. వాహనదారులు నిబంధనలు పాటించేలా పోలీసులు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని సీఐ దీపక్ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

## జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 13,(ప్రజా జ్యోతి)** వినాయక చవితి పర్వదినా న్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించి విజయాలను ప్రసాదించే విఘ్నేశ్వరుని ఆశీస్సులతో జిల్లా ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు వెల్లివిరి యాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం ఆనందో త్సాహాలతో, ప్రశాంత వా తావరణంలో వినాయక చవితి వేడుకలను జరుపు కో వాలని కోరారు. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో, ప్రశాంత వాతావరణం లో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవ హరించాలని, మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణహిత నిమజ్జనా నికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్, అగ్నిప్రమా దాలు తదితర ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలు పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని కోరారు. నిమజ్జన కార్యక్రమాలను అధికారుల సూచనలు పాటిస్తూ, నిర్దేశించిన ప్రదేశాల్లో సురక్షితంగా నిర్వహించాలని తెలిపారు. శ్రీ వినాయకుని కృపాకటాక్షాలతో జిల్లా ప్రజలందరికీ సుఖ శాంతులు, ఆయురా రోగ్యాలు, సర్వతోముఖ అభివృద్ధి, శ్రేయస్సు చేకూరాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

## బాసరలో ఘనంగా వినాయక చవితి శోభా యాత్ర




**బాసర సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి)**బాసర వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని బాసరలో సార్వజనిక గణేష్ మండలి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధ్యక్షులు సింగారం గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు బాసరలోని సార్వజనిక గణేష్ మండలి వద్ద నుంచి అంగడి బజార్ హనుమాన్ ఆలయం వరకు శోభాయాత్రలి నిర్వహించనున్నారు.ప్రత్యేక పూజలు అనంతరం సాంప్రదాయబద్ధంగా శోభాయాత్ర కొనసాగ నుంది. ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, మీడియా ప్రతినిధులు, బాసర గ్రామస్తులు, భక్తులు మరియు శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సార్వజనిక గణేష్ మండలి అధ్యక్షులు సింగారం గణేష్ కోరారు.విఘ్నేశ్వరుని ఆశీస్సులతో బాసర ప్రజలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని సింగారం గణేష్ ఆకాంక్షించారు.

## లాడ్జిలలో పోలీసుల విస్తృత తనిఖీలు

**గుర్తింపు కార్డులు లేకుండా గదులు అద్దెకు ఇవ్వొద్దు**






**బాసర, సెప్టెంబర్ 13 (ప్రజాజ్యోతి)** బాసర ఆలయం వద్ద ఉన్న ప్రైవేట్ లాడ్జిలలో పోలీసులు ఆదివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల, భైంసా ఏఎస్పీ సాయికిరణ్ ఆదేశాల మేరకు ముధోల్ సీఐ రవీందర్ నాయక్, బాసర సీఐ దీపక్ ఆధ్వర్యంలో పోలీసులు లాడ్జిలను తనిఖీ చేశారు. లాడ్జి యజమానులు గుర్తింపు కార్డులు లేకుండా గదులను అద్దెకు ఇవ్వకూడదని సూచించారు. గదులను అద్దెకు తీసుకున్న వారి వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్లలో నమోదు చేసుకోవాలని పోలీసులు ఆదేశించారు. లాడ్జి యజమానులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐలు సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ కాలా క్రియేటివ్ డిజిటల్ స్కిల్ డెవలప్ మెంట్ ఇన్‌స్టిట్యూట్ మొద టి నాలుగు నెలల బ్యాచ్ విజయవంతం

**శిక్షణ పూర్తి చేసిన విద్యార్థు లకు సర్టిఫికెట్లు అందజేసిన ఎమ్మెల్యే పాయల్ శంకర్**




**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 13,( ప్రజా జ్యోతి)** అదిలాబాద్ కాలా క్రియేటివ్ అండ్ డిజిటల్ స్కిల్ డెవలప్ మెంట్ ఇన్స్టిట్యూట్ తన మొదటి నాలుగు నెలల బ్యాచ్ సువిజయవంతంగా పూర్తి చేసింది. ఇందులో శిక్షణ పూర్తి చేసిన విద్యార్థు లకు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సర్టిఫికెట్ లు అందజేశారు. ఈ శిక్షణ లో పొందిన నైపుణ్యాలను ఉపయోగించి, దాదాపు 70 శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలు, ఫ్రీలాన్స్ అవకాశాలు పొందారు. ఈ ప్రోగ్రామ్ గ్రాఫిక్ డిజైన్, డిజిటల్ మార్కెటింగ్, వీడియో ఎడిటింగ్, క్రియేటివ్ టెక్నాలజీ, ఏఐ టూల్స్ వంటి ఆచర ణాత్మక, పరిశ్రమకు సంబం ధించిన నైపుణ్యాలపై దృష్టి సారించింది. తద్వారా, వేగంగా అభివృద్ధి చెందుతున్న డిజిటల్, ఏఐ ప్రపంచం లో రాబోయే అవకాశాలకు విద్యార్థులను సిద్ధం చేసింది. విద్యార్థు లతో మాట్లాడి, వారి కృషిని అభినందించి, సర్టి ఫికెట్లను అందజే శారు. ఇన్ స్టిట్యూట్‌ను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడి, సర్టి ఫికెట్లను అందజేశారు. ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందిం చుకోవడం కొనసాగించాలని, కొత్త కెరీర్ అవ కాశాలను అందిపుచ్చుకోవాలని ఆయన వారిని ప్రోత్స హించారు. మొదటి బ్యాచ్‌కు తల్లిదండ్రుల నుంచి కూడా మంచి స్పందన లభించింది. తమ పిల్లల ఆత్మవి శ్వాసం, ఆచరణాత్మక సా మర్థ్యాలు, డిజిటల్ ప్రపంచంపై అవగాహనలో స్పష్ట మైన మెరుగుదల కనిపిం చిందని, చాలా మంది తల్లి దండ్రులు గుర్తించారు.

## అసెంబ్లీ గంట మోగితే..

## రూ. కోట్లలోనే ఖర్చు!

**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీలో ప్రస్తుతం జరుగుతున్న సమావేశాల్లో స్పీకర్ గంట మోగించగానే చర్చ మొదలవుతోంది. కానీ ఆ గంట మోగడం వెనుక ప్రతి గంటకు రూ. 15 నుంచి 20 లక్షల వరకు ఖర్చవుతుందని ఢిల్లీకి చెందిన స్వతంత్ర ఎన్జీవో సంస్థ పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ సేకరించిన గణాంకాలు చెబుతున్నాయి. ఎందుకంటే శాసనసభ నడవాలంటే తెరవెనుక పెద్ద సైన్యమే పనిచేస్తుంది. 250 మంది అసెంబ్లీ సచివాలయ సిబ్బంది, మార్షల్స్, 300 మంది పోలీసులు, శాసనసభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు సిద్ధం చేయడానికి వివిధ శాఖలకు చెందిన సుమారు 400 మంది సెక్షన్ ఆఫీసర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అసెంబ్లీకి వస్తారు. వారందరికీ ఓవర్ టైం అలవెన్స్, భోజనం, రవాణా ఖర్చు ప్రభుత్వానిదే. దీనికితోడు అసెంబ్లీ హాల్‌లో ఏసీలు, లైటింగ్, లైవ్ టెలికాస్ట్, వాటి నిర్వహణ సిబ్బంది, క్యాంటీన్, కాగితాల ముద్రణ ఖర్చులు అదనం. ఇవి కాకుండా సభ జరిగే రోజున ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి రోజువారీ భత్యం రూ. 2,000, ప్రయాణ భత్యం, హైదరాబాద్‌లో ఉచిత బంగ్లా, కారు, ఇద్దరు పీఏల జీతాలను ప్రభుత్వమే భరిస్తుంది. సభకు హాజరు కాకపోయినా జీతం వస్తుంది కానీ డైలీ అలవెన్స్ మాత్రం సభకు వస్తేనే లభిస్తుంది. ఇలా అన్నీ కలిపితే కేవలం ఒక రోజుపాటు (ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా లెక్కన) రాష్ట్ర శాసనసభ నిర్వహణకు దాదాపు రూ. కోటి నుంచి రూ.కోటిన్నర దాకా ఖర్చవుతుంది. గతంలో ఒక బ్రీఫింగ్ మీటింగ్‌కే రూ. 13.59 లక్షలు ఖర్చు చేసినట్లు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. గతేడాది రాష్ట్ర అసెంబ్లీ 149 గంటలపాటు జరిగిందని పీఆర్ఎస్ నివేదిక చెబుతోంది.

# ప్రశాంత వాతావరణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలి.ఎస్.ఐ ఉదయ్ కిరణ్



**జన్నారం,సెప్టెంబర్13(ప్రజాజ్యోతి)** గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఆదివారం రోజున పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్.ఐ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ వినాయక ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మండపాల నిర్వహణ, ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల్లో ప్రభుత్వ నిబంధనలు, పోలీస్ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.ట్రాఫిక్ కు ఇబ్బంది కలగకుండా చూడాలని, విద్యుత్, అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీజేలు, లౌడ్ స్పీకర్ల వినియోగంలో నిబంధనలు అతిక్రమించరాదని హెచ్చరించారు.మత సామరస్యాన్ని కాపాడుతూ, ఇతరులకు ఇబ్బంది కలగకుండా నవరాత్రులు జరుపుకోవాలని, వివాదాస్పద వ్యాఖ్యలు, రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని పీస్ కమిటీ సభ్యులకు సూచించారు. మండపాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించినా, ఏదైనా సమస్య తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.నవరాత్రి ఉత్సవాలను ప్రజల సహకారంతో శాంతియు తంగా, సోదరభావంతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు.ఈ సమావేశంలో పీస్ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# 5,261 కేసులకు పరిష్కారం

**రూ.33.65 లక్షలు సైబర్ బాధితులకు తిరిగి అందజేత**

**రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా**




**మంచిర్యాల, 13,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** జాతీయ మెగా లోక్ అదాలత్‌లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 5,261 కేసులు పరిష్కారమయ్యాయి. సైబర్ నేరాలకు సంబంధించి 125 కేసుల్లో బాధితులకు రూ.33,65,739 నగదును తిరిగి అందజేశారు. ఈ వివరాలను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదివారం తెలిపారు.ఈ నెల 12న నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలో వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదై దర్యాప్తులో ఉన్న, అలాగే న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న రాజీకి వీలైన కేసులను పరిష్కరించారు. ఇందులో 613 ఐపీసీ కేసులు, ప్రత్యేక చట్టాలకు సంబంధించిన 36 కేసులు, 2,872 ఈ-చలాన్ కేసులు, 1,740 మద్యం సేవించి వాహనం నడిపిన కేసులు ఉన్నాయి. మొత్తంగా 5,261 కేసులు పరిష్కరించినట్లు కమిషనర్ వెల్లడించారు. అదేవిధంగా కమిషనరేట్ పరిధిలో నమోదైన 123 సైబర్ నేర కేసుల్లో బాధితులకు రూ.27,58,843 తిరిగి అందజేశారు. సీసీఎస్ పోలీస్‌స్టేషన్, రామగుండంలో నమోదైన మరో 2 సైబర్ నేర కేసుల్లో రూ.6,06,896 బాధితులకు తిరిగి అందించారు. దీంతో మొత్తం 125 సైబర్ నేర కేసుల్లో రూ.33,65,739 బాధితులకు తిరిగి అందజేసినట్లు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా పెట్టీ కేసులు, ట్రాఫిక్, ఎక్సైజ్, మద్యం సేవించి వాహనం నడిపిన కేసులు తదితర స్వల్ప నేరాలకు సంబంధించిన కేసులు వేగంగా పరిష్కారమయ్యాయని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంతో ప్రజలకు సమయం, ధనం ఆదా అయ్యాయని అన్నారు. కేసుల పరిష్కారానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించారని తెలిపారు. గత 15 రోజులుగా రామగుండం పోలీస్ కమిషనరేట్ అధికారులు, న్యాయస్థాన సిబ్బంది కేసుల్లోని పక్షాలను స్వయంగా కలిసి రాజీ మార్గమే ఉత్తమ మార్గమని, లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని అవగాహన కల్పించారని తెలిపారు. దీంతో నిర్దేశించిన లక్ష్యానికి మించి కేసులను పరిష్కరించగలిగామని తెలిపారు.ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ అధికారులు, సిబ్బందిని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. ప్రతిరోజూ కేసుల పరిష్కారాన్ని పర్యవేక్షించిన అధికారులు, కృషి చేసిన సిబ్బందికి త్వరలో పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. కమిషనరేట్‌లో నిరంతరం సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ జాతీయ మెగా లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేసిన రెండు జోన్ల ప్రధాన న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవా సంస్థలకు పోలీస్ శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిరోజూ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు న్యాయస్థాన విధులను సమర్థవం తంగా నిర్వహిస్తూ లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేసిన అధికారులు, సిబ్బందిని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

## అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలి

**ఆరు గ్యారంటీలు, యూత్ డిక్లరేషన్ అమలుకు చర్యలు తీసుకోవాలి**

**నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి: డీవైఎఫ్ఐ**




**ఆసిఫాబాద్, సెప్టెంబరు 13, ప్రజా జ్యోతి** అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలు, రాష్ట్ర అభివృద్ధి, విద్య, వైద్యం, ఉద్యోగాల అంశాలపై ప్రాధాన్యంగా చర్చించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి గొడిసెల కార్తీక్ కోరారు. ఆసిఫాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, యూత్ డిక్లరేషన్‌లోని హామీల అమలుపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాలని కోరారు. నిరుద్యోగ భృతి అమలు చేయడంతో పాటు జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని కార్తీక్ తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గెడం టికానంద్, కార్యదర్శి దుర్గం రాజ్‌కుమార్, కోశాధికారి దుర్గం నిఖిల్, నాయకులు ఆత్మకూరి సతీష్, వద్లూరి శ్రీకాంత్, చాపిడి పురుషోత్తం, కుందరపు మంజుల తదితరులు పాల్గొన్నారు.